ప్రభాత
ఉదయం
తెలుగు దినపత్రిక

రిపోర్టర్లు కావలెను

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం
తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా
జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా
రిపోర్టర్లు కావలెను.

సంప్రదించండి
ఫోన్: 93910 89608

సంపుటి: 3 | సంచిక: 5 | పేజీలు: 4 | వెల: రూ.3/- | గురువారం 17 ఏప్రిల్ 2025 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి

# వక్ఫ్ రాజ్యాంగ బద్ధతపై సుప్రీం విచారణ

**స్టే ఇవ్వడానికి సుప్రీం ధర్మాసనం నిరాకరణ**
**విచారణ నేటికి వాయిదా వేసిన ధర్మాసనం**

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 16 (ప్రభాత ఉదయం):** వక్ఫ్ సవరణ చట్టం-2025 రాజ్యాంగబద్ధతను సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో దాఖల్కెన పిటిషన్లపై బుధవారం విచారణ జరిగింది. వక్ఫ్ చట్టంపై స్టే విధించేందుకు సుప్రీం నిరాకరించింది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని ముగ్గురుసభ్యుల ధర్మాసనం వాటిని విచారించింది. వక్ఫ్ చట్టరూపాన్ని ఆర్టికల్ 26 నిరోధించదని, ఆ రాజ్యాంగ నిబంధన సార్వత్రికమైందని ధర్మాసనం వ్యాఖ్యానించింది. అందరికీ వర్తించే ఈ నిబంధన లౌకికమైన స్వభాన్ని కలిగిఉందని చెప్పింది. అలాగే కేంద్రానికి పలు ప్రశ్నలు సంధించింది. ఈ మేరకు నోటీసులు జారీచేసింది. వందల ఏళ్లనాటి ఆస్తులకు పత్రాలు ఎక్కడినుంచి వస్తాయని ప్రశ్నించింది. వక్ఫ్ చట్టంపై ఆందోళనల్లో హింస చోటుచేసుకోవడం బాధాకరమని వ్యాఖ్యానించింది. పిటిషనర్ల తరఫు న్యాయవాది కపిల్ సిబల్ అత్యున్నత న్యాయస్థానంలో వాదనలు వినిపించారు. ఈ చట్టం జాతీయస్థాయి పరిణామాలను కలిగి ఉందని, ఈ పిటిషన్లను హైకోర్టుకు రిఫర్ చేయొద్దని మరో సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ కోరారు. వక్ఫ్ బై యూజర్ అనేది ఎప్పటినుంచో అమల్లో ఉన్న పద్ధతి అని మరో న్యాయవాది హుజేఫా అహ్మదీ వెల్లడిరచారు. మరోపక్క. ప్రభుత్వం ఏర్పాటు- చేసిన సంయుక్త పార్లమెంటరీ కమిటీ వక్ఫ్ బిల్లుపై విస్తృత చర్చ జరిపిందని కేంద్రం కోర్టుకు వెల్లడిరచింది. అనంతరం కోర్టు విచారణను రేపటికి వాయిదా వేసింది. ఇటీవల పార్లమెంట్ ఆమోదం పొందిన వక్ఫ్ సవరణ చట్టం ఏప్రిల్ 8 నుంచి అమల్లోకి వచ్చింది. ఇటీవల మోదీ సర్కారు ఆమోదించిన వక్ఫ్ బిల్లు చట్టభద్ధతను సవాల్ చేస్తూ దాఖల్కెన పిటిషన్ల పై సుప్రీం కోర్టు విచారణ ప్రారంభించింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్, జస్టిస్ కేవీ విశ్వనాథన్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ విచారణ చేపట్టింది. వక్ఫ్ బిల్లు చట్టభద్ధతను సవాల్ చేస్తూ సుప్రీం కోర్టులో 10 పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ పిటిషన్లు దాఖలు చేసిన వారిలో ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ, కాంగ్రెస్ ఎంపీ మహమ్మద్ జావేద్, టీఎంసి ఎంపీ మహువా మొయిత్ర, ఎస్పీ ఎంపీ జియా ఉర్ రెహమాన్, అర్జేడి ఎంపీ మనోజ్ కుమార్ ర%ఝ%, ఆప్ ఎమ్మెల్యే అమనాతుల్లా ఖాన్, మణిపూర్ ఎమ్మెల్యే






## సుప్రీం తీర్పును స్వాగతించిన
# బిఆర్ఎస్

**ఇప్పటికైనా పద్ధతి మార్చుకోవాలన్న కెటిఆర్**

**హైదరాబాద్, ఏప్రిల్ 16 (ప్రభాత ఉదయం):** కంచె గచ్చిబౌలి భూములపై సుప్రీంకోర్టు ఆదేశాలను భారత రాష్ట్ర సమితి స్వాగతం తెలిపింది.ఇది ప్రభుత్వానికి గుణపాఠం కావాలని అన్నారు. కంచ గచ్చిబౌలిలో ధ్వంసం చేసిన అడవులను పునరుద్ధరించాలంటూ సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను స్వాగతిస్తున్నట్లు పార్టీ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో పాటు రాష్ట్ర చీఫ్ వైల్డ్ ల్కెఫ్ వార్డెన్‌కు వన్యప్రాణులను కాపాడాలంటూ ఆదేశాలు ఇవ్వడం గొప్ప విజయమని పేర్కొన్నారు.. వన్యప్రాణుల పట్ల, పర్యావరణ పరిరక్షణకు పాటుపడే ప్రతి ఒక్కరికి దక్కిన విజయం అంటూ పేర్కొన్నారు. గొంతులేని మూగజీవాల కోసం, చెట్ల కోసం, పర్యావరణం కోసం అండగా నిలబడిన హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులకు ధన్యవాదాలు తెలిపారు.సుప్రీంకోర్టు ఏర్పాటు చేసిన కేంద్ర సాధికారిక కమిటీ ఇచ్చిన సిఫార్సులను కూడా భారత రాష్ట్ర సమితి స్వాగతిస్తున్నదని పేర్కొన్నారు. కంచ గచ్చిబౌలిని ప్రైవేట్ పార్టీకి తాకట్టు పెట్టిన రేవంత్ రెడ్డి ప్రభుత్వ

..మిగతా 2లో

## వర్సిటీ భూములపై
# సర్కార్‌కు చెంపదెబ్బ



**కంచగచ్చబౌలి భూములపై సుప్రీం సీరియస్**
**సుప్రీం మార్గదర్శకాలు విస్మరించి చెట్ల నరికివేతపై ఆగ్రహం**
**ఆ భూముల్లోనే తాత్కాలిక జ్కెలు నిర్మించి అధికారులను వేస్తాం**
**నాలుగు వారాల్లో పునరుద్దరణ నివేదిక సమర్పించాలని ఆదేశం**
**స్టేటస్‌కో కొనసాగుతుందని వెల్లడి...విచారణ మే 15కు వాయిదా**

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 16 (ప్రభాత ఉదయం):** కంచ గచ్చిబౌలి భూముల అంశంపై సుప్రీంకోర్టులో కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎదురుదెబ్బ తగిలింది. చెట్ల నరికివేతపై రేవంత్ సర్కార్‌పై సర్వోన్నత న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. చెట్లు కొట్టేసే ముందు అనుమతులు తీసుకున్నారో లేదో స్పష్టంగా చెప్పాలని జస్టిస్ బీఆర్ గవాయి నిలదీశారు. సీఎస్‌ను కాపాడాలని అనుకుంటే.. వంద ఎకరాలను ఎలా పునరుద్ధిస్తారో చెప్పాలని అన్నారు. దీనిపై నాలుగు వారాల్లో ప్రణాళిక సిద్ధం చేయాలని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. తదుపరి విచారణను మే 15వ తేదీకి వాయిదా వేశారు. అప్పటి వరకు స్టేటస్ కో కొనసాగుతుందని అన్నారు. కంచ గచ్చిబౌలి భూముల అంశంపై జస్టిస్ బీఆర్ గవాయి నేతృత్వంలోని ద్విసభ్య ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా చెట్లు కొట్టివేసే ముందు అనుమతులు తీసుకున్నారో లేదో స్పష్టంగా చెప్పాలని జస్టిస్ బీఆర్ గవాయి ప్రశ్నించారు. దీనికి ప్రభుత్వ తరఫున లాయర్ స్పందిస్తూ జామాయిల్ తరహా చెట్లు-, పొదలను అనుమతి తీసుకునే తొలగించామని తెలిపారు. అందుకు చెట్ల నరికివేతపై సమర్థించుకోవద్దని జస్టిస్ బీఆర్ గవాయి ఆగ్రహం వ్యక్తం చేశారు. 1996లో సుప్రీంకోర్టు ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారం అనుమతులు తీసుకున్నారో లేదో చెప్పాలన్నారు. వారంతపు సెలవుల్లో మూడు రోజుల్లో చెట్లు కొట్టాల్సిన తొందర ఎందుకొచ్చిందని ప్రశ్నించారు. విరీరు చెట్లు కొట్టడం వల్ల అక్కడ జంతువుల విరీద కుక్కలు దాడి చేస్తున్నాయని.. ఆ వీడియోలను చూసి ఆందోళనకు గురయ్యామని తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో రాజీపడే ప్రసక్తే లేదని

..మిగతా 3లో



## సుప్రీం తదుపరి సిజెగా
# జస్టిజ్ బిఆర్ గవాయ్

**సిఫారసు చేసిన కొలీజియం**

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 16 (ప్రభాత ఉదయం):** భారత సుప్రీంకోర్టు తదుపరి ప్రధాన న్యాయమూర్తి గా జస్టిస్ బీఆర్ గవాయ్ నియమితులయ్యారు. కొలీజియం సిఫారసుల మేరకు ప్రస్తుత భారత ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా తదుపరి ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ గవాయ్ పేరును ప్రతిపాదించారు. వచ్చే నెల 13న జస్టిస్ సంజీవ్ ఖన్నా పదవీ కాలం ముగియనుండటంతో ఆయన స్థానంలో కొత్త ప్రధాన న్యాయమూర్తిని

..మిగతా 2లో



## భారీగా పెరిగిన
# బంగారం ధరలు

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 16 (ప్రభాత ఉదయం):** ప్రపంచవ్యాప్తంగా చోటు-చేసుకుంటు-న్న వాణిజ్య మార్పులు భారత మార్కెట్‌పై భారీ ప్రభావాన్ని చూపిస్తున్నాయి. ఈ క్రమంలోనే దేశ రాజధాని ఢల్లీలో బుధవారం 24 క్యారెట్ల బంగారం ధరలు రూ.1,650 పెరిగి 10 గ్రాములకు రూ.98,100కు చేరాయి. ఇదే సమయంలో 99.5 శాతం స్వచ్ఛత కలిగిన బంగారం ధర కూడా రూ.1,650 పెరిగి రూ.97,650 స్థాయికి చేరుకుంది. ఈ ధరలు ప్రస్తుతం ఆల్ -ట్కెం గరిష్ట స్థాయికి చేరుకున్నాయి.

# అడవుల తరహాలోనే గచ్చీబౌలి భూములు

**నివేదిక ఇచ్చిన కేంద్ర సాధికారిక కమిటీ**



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 16 (ప్రభాత ఉదయం):** తెలంగాణలో గచ్చిబౌలి భూముల విషయంలో పర్యావరణ పరిరక్షణకు అనుకూలంగా కేంద్ర సాధికారిక కమిటీ ఒక కీలక నివేదికను సమర్పించింది. ఈ నివేదికలో పలు సూచనలు, సిఫార్సులతో పాటు పర్యావరణం, అడవుల పరిరక్షణపై గాఢమైన దృష్టిని వెల్లడిరచింది. గచ్చిబౌలి భూముల్లో అటవీ లక్షణాలు ఉన్నట్లు ప్రాథమికంగా నిర్ధారణ చేసిన సీఈసీ, తుది నివేదిక కోసం అటవీ సర్వే అనంతరం నాలుగు వారాల గడువు కోరింది. సీఈసీ నివేదిక ప్రకారం, హైకోర్టు ఆదేశాలు ఇచ్చేవరకు గచ్చిబౌలి భూములపై ఎలాంటి కొత్త నిర్మాణాలు, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టరాదు.


## నేటి నుంచి భూభారతి
# అవగాహన సదస్సులు

**నాలుగు మండలాల్లో పైలెట్ ప్రాజెక్టుగా అమలు**
**ఉమ్మడి పాలమూరు జిల్లాలో ప్రారంభించనున్న పొంగులేటి**



**హైదరాబాద్, ఏప్రిల్ 16 (ప్రభాత ఉదయం):** ధరణి స్థానంలో తీసుకుని వచ్చిన తెలంగాణ భూ భారతి కార్యక్రమం గురువారం నుంచి నాలుగు మండలాల్లో పైలట్ ప్రాజెక్టుగా అమలు కానుంది. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెడుతున్న భూభారతి పైలట్ ప్రాజెక్టు రాష్ట్రంలోని నాలుగు మండలాల్లో ప్రారంభించ నున్నారు. ములుగు జిల్లా వెంకటాపురం, ఖమ్మం జిల్లా నేలకొండపల్లి, కామారెడ్డిలోని లింగంపేట, నారాయణపేట జిల్లా మద్దూర్ మండలంలోని ఖాజీపురంలో భూ భారతి పైలట్ ప్రాజెక్టు ప్రారంభించనున్నారు.. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలోని మద్దూర్ మండలం ఖాజీపురంలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రాజెక్టు ప్రారంభించనున్నారు. అలాగే..

..మిగతా 2లో



## వరుసగా రెండోరోజూ
# ఈడి విచారణకు వాద్రా

**భర్త వెంట వచ్చిన ప్రియాంక గాంధీ**

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 16 (ప్రభాత ఉదయం):** హరియాణా భూ ఒప్పందానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసు విచారణలో భాగంగా రాబర్ట్ వాద్రా వరుసగా రెండోరోజు ఇడి ముందు హాజరయ్యారు. ఇది కక్షపూరిత కేసని అన్నారు. ఎప్పుడో పాత కేసులో మళ్లీ ఇప్పుడు విచారణ ఏమిటని ప్రశ్నించారు. రాబర్ట్ వాద్రా బుధవారం మరోసారి ఈడీ కార్యాలయానికి వచ్చారు.

# అక్రమ వలసదారులకు ట్రంప్ బంపర్ ఆఫర్

**స్వీయ బిష్కరణ పథకం అందచేస్తామని ప్రకటన**
**విమాన ఖర్చులతో పాటు, దారి బత్తెం ఇస్తామని వెల్లడి**

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 16 (ప్రభాత ఉదయం):** అక్రమ వలసదారులను దేశం నుంచి పంపించేందుకు ఇన్నాళ్లూ కఠిన నిబంధనలు అమలు చేస్తూ వచ్చిన అమెరికా ప్రభుత్వం.. తాజాగా వారికి ఓ బంపర్ఆఫర్ ఇచ్చింది. ఎవరైతే స్వచ్ఛందంగా అమెరికా వీడి తమ స్వదేశానికి వెళ్లిపోతారో.. వారికి విమాన టికెట్లతో పాటూ కొంత ఆర్థిక సాయం కూడా చేయబోతున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఓ టీవీకి ఇచ్చిన ఇంటర్వూలో పేర్కొన్నారు. అమెరికా నుంచి బయటికి పంపించడంపై దృష్టి సారించినట్లు చెప్పారు. అమెరికాలోని వలసదారులపై డొనాల్డ్ ట్రంప్ మాట్లాడుతూ దేశం విడిచివెళ్లేవారికి విమాన ఛార్జీలు, స్టైఫండ్‌ను అందిస్తున్నట్లు- చెప్పారు. ఈ సందర్భంగా యాంకర్ ట్రంప్‌కు ఓ వీడియో చూపించారు. ఓ వ్యక్తి 20 ఏళ్ల క్రితం చట్టవిరుద్ధంగా అమెరికాకు వచ్చాడని, ప్రస్తుతం అతికి పిల్లలు కూడా ఉన్నారని ఆ వీడియో సారాంశం. తాను ఓటు వేయలేకపోయినా, తాను ట్రంప్‌కు మద్ధతు ఇచ్చేవాడినని ఆ వ్యక్తి తెలిపారు. ఈ

..మిగతా 2లో



## సుప్రీం తీర్పు
# ప్రభుత్వానికి చెంపపెట్టు

**కాంగ్రెస్ పర్యావరణ విధ్వంసాన్ని**
**గుర్తించిన ధర్మాసనం**
**మాజీమంత్రి హరీష్ రావు వెల్లడి**



**హైదరాబాద్, ఏప్రిల్ 16 (ప్రభాత ఉదయం):** కంచ గచ్చిబౌలి భూముల విషయంలో సుప్రీంకోర్టు తీర్పును మాజీ మంత్రి, సిద్దిపేట బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు స్వాగతించారు. కాంగ్రెస్ ప్రభు త్వం చేసిన, చేయబోతున్న పర్యావరణ విధ్వంసం ఎంత భయంకరమైందో సుప్రీం కోర్టులో జరిగిన వాదనల వల్ల ప్రపంచానికి తేటతెల్లమైంది అని హరీశ్‌రావు పేర్కొ న్నారు. బాధ్యత గల ప్రభుత్వం,

..మిగతా 2లో



## బంజారాల ఐక్యత కోసమే ఆలయ నిర్మాణం

**బంజారా కులసంఘ పీఠాధిపతి దీక్షగురు మహారాజ్**

చెన్నూర్, ఏప్రిల్ 16. (ప్రభాత ఉదయం) : బంజారా బంజారాల ఐక్యత కోసమే తమ ఆరాధ్య దైవం శ్రీ సేవాలాల్, జగదాంబ దేవిల ఆలయ నిర్మాణాలు చేపడుతున్నట్లు బంజారా కులసంఘ పీఠాధిపతి దీక్ష గురు మహారాజ్ తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం రోజున కోటపల్లి మండలం ఎసన్వాయి గ్రామంలో భూమి పూజ నిర్వహించి, ఆలయ నిర్మాణానికి భూమిని దానంగా ఇచ్చిన భూక్యా సీతాబాయి, బద్య నాయక్ దంపతులను అభినందించారు. ఆరాధ్య దైవాలను స్మరిస్తూ బంజారాలంతా అభివృద్ధి వైపు ముందుకు నడవాలని ఆయన సూచించారు. సమాజంలో అసమానతలు తొలగాలని విద్య ద్వారానే మార్పు సాధ్యమవుతుందని, బాల్య వివాహాలకు అందరూ దూరంగా ఉండాలని, చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ ప్రతీ ఒక్కరూ సత్ప్రవర్తనతో మెలగాలని, అసంఘీక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని ఆయన సూచించారు. అనంతరం తండా వాసులతో భక్తి సమావేశాలు నిర్వహించి, తండా నాయక్ కారోబార్ వ్యవస్థ గురించి అవగాహన కల్పించి ఐదుగురితో కూడిన నాయక్ కారోబార్ల కమిటీని ఏర్పాటు చేశారు. తండా నాయకగా అజ్మీరా సంతోష్ నాయక్, కారోబారిగా బుఖ్య బాధ్య నాయక్, డావ్ గా భానోత్ సురేష్, విచారిగా అజ్మీర నాగేష్, గేరియగా అజ్మీరా హరిలాల్ లను నియమిస్తున్నట్లు బంజారాల సమక్షంలో ప్రకటించి తండా బాధ్యతలు అప్పగించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సీమా నాయక్, సర్పంచుల సంఘ అధ్యక్షుడు సపోర్ట్ శంకర్ నాయక్, మొదటి తండా పెద్ద ధూప నాయక్, లోకేష్ ప్రేమ్ కుమార్, కిష్టయ్య, హర్ష నాయక్, మహేందర్, లాల్ కుమార్, సంపత్, అజ్మీర పున్నం, మధు మల్లేష్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## వక్ఫ్ రాజ్యాంగ బద్దతపై సుప్రీం విచారణ

మొదటి పేజీ తరువాయి...

షేక్ నూరుల్ హాసన్, వైసీపీ, డిఎంకె, టీవికే అధినేత విజయ్, సిపిఐ సహా కొన్ని ముస్లిం సంఘాలు ఉన్నాయి. ఇక, పిటీషనర్ల తరపున సీనియర్ న్యాయవాది కపిల్ సిబాల్ వాదనలు వినిపించారు. మరోవైపు వక్ఫ్ బోర్డు సవరణ చట్టంను సవాల్ చేస్తూ దాఖల్కైన పిటిషన్ల విచారణకు ముందు తమ వాదనలు కూడా వినాలని పలు రాష్ట్రాలు సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలు చేశాయి. పిటిషన్లు దాఖలు చేసిన రాష్ట్రాల్లో అస్సాం, రాజస్థాన్, ఛత్తీస్‌ఘఢ్, ఉత్తరాఖండ్, హర్యానా, మహారాష్ట్ర ప్రభుత్వాలు ఉన్నాయి. వీరంతా ఈ చట్టాన్ని సమర్థిస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఇక, కపిల్ సిబాల్ వాదనల ప్రకారం పార్లమెంటు చట్టం ద్వారా మత విశ్వాసంలో కీలకమైన అంతర్భాగ అంశాలలో తలదూర్చారని కపిల్ సిబాల్ అత్యున్నత న్యాయంస్థానం ముందుకు తీసుకెళ్లారు. ఆర్టికల్ 25, 26లకు వ్యతిరేకంగా వక్ఫ్ సవరణ చట్టం ఉందని కపిల్ సిబాల్ అన్నారు.

## సుప్రీం తీర్పును స్వాగతించిన బిఆర్ఎస్

మొదటి పేజీ తరువాయి...

వ్యవహారంలో ఆర్థిక అవకతవకలు జరిగే అవకాశం ఉందని అభిప్రాయం వ్యక్తం చేసిన కేంద్ర సాధికారిక కమిటీ- మా పార్టీ వాదనను బలపరుస్తున్నదని తెలిపారు. కంచ గచ్చిబౌలి భూముల తాకట్టు- విషయంలో పదివేల కోట్ల రూపాయల అవినీతికి రేవంత్ రెడ్డి పాల్పడ్డారని చేసిన ఆరోపణలను పునరుద్ఘాటించారు. అడవుల పట్ల, వన్యప్రాణుల పట్ల రేవంత్ రెడ్డి నెంబర్ వన్ విలన్‌గా మారాడని విమర్శించారు. పర్యావరణ విధ్వంసానికి... పర్యావరణ హత్యకు పాల్పడి తప్పించుకోలేరనే కనీస సోయి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇకనైనా వస్తుందని ఆశాభావం వ్యక్తం చేసారు సీఎం రేవంత్ రెడ్డి తనను తాను మోసం చేసుకున్న విషయాన్ని అర్థం చేసుకుని పర్యావరణ విధ్వంసం ఆపాలని కోరారు.

## సుప్రీం తదుపరి సిజెగా జస్టిజ్ బిఆర్ గవాయ్

మొదటి పేజీ తరువాయి...

ప్రకటించారు. జస్టిస్ గవాయ్ మే 14న సీజేఐగా ప్రమాణస్వీకారం చేయనున్నారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆయన చేత ప్రమాణ స్వీకారం చేయించనున్నారు. కాగా డీవై చంద్రచూడ్ పదవీ విరమణతో ప్రస్తుత సీజేఐ సంజీవ్ ఖన్నా 2024 నవంబర్‌లో ప్రమాణస్వీకారం చేశారు. గవాయ్ పూర్తిపేరు భూషణ్ రామకృష్ణ గవాయ్. ఆయన 1960 నవంబర్ 24న అమ్రావతిలో జన్మించారు. 1985 మార్చి 16న బార్‌లో సభ్యుడిగా చేరారు.

## సుప్రీం తీర్పు ప్రభుత్వానికి చెంపపెట్టు

మొదటి పేజీ తరువాయి...

కావాలనే సెలవు దినాల్లో బుల్‌డోజర్లతో విధ్వంసానికి పాల్పడటంపై సుప్రీం కోర్టు చేసిన వ్యాఖ్యలు ఈ ప్రభుత్వానికి చెంపపెట్టు-. విధ్వంసం చేసిన వంద ఎకరాలను ఎలా పునరుద్ధరిస్తారో చెప్పాలని నిలదీయడం ఆహ్వానించదగ్గ పరిణామం. కంచె గచ్చిబౌలి భూములను, పర్యావరణాన్ని కబళించాలని చూసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి సెంట్రల్ ఎంపవర్డ్ కమిటీ- తన రిపోర్టుతో కళ్లు తెరిపించింది అని హరీశ్‌రావు తెలిపారు. అధికారం ఉంది కదా అని ఇష్టారీతిగా వ్యవహరిస్తే సభ్య సమాజం, న్యాయ వ్యవస్థ చూస్తూ ఊరుకోవని.. రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడటానికి ముందుకు వస్తాయని గతంలోనూ అనేక సార్లు నిరూపన్కైంది. ఈరోజు కూడా అదే జరిగింది. విధ్వంసమే విధానంగా సాగుతున్నది రేవంత్ రెడ్డి నిరంకుశ పాలన.. నాడు హైడ్రా పేరుతో ఇండ్లు కూల్చి అరాచకం. నేడు బుల్‌డోజర్లతో పర్యావరణ హననం. మాకు న్యాయస్థానాల వీరిద ఎంతో గౌరవం ఉంది. అందుకే బాధ్యతగా బిఆర్ఎస్ పార్టీ తరుపున సెంట్రల్ ఎంపవర్డ్ కమిటీ-కి నివేదిక ఇచ్చాం. ఆధారాలతో సహా వాస్తవాలు వివరించాం. వృక్షో రక్షతి రక్షిత అని పెద్దలంటే, వృక్షో భక్షతి అన్నట్లు-గా తయారైన రేవంత్ రెడ్డికి బుద్ధి చెప్పేందుకు రాష్ట్ర ప్రజలందరూ ఏకం కావాలి అని హరీశ్‌రావు పిలుపునిచ్చారు.

# గాడి తప్పిన కాంగ్రెస్ పాలన?

**పరిపాలన మీద దృష్టి పెట్టకుండా బిఆర్ఎస్ జపం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం. ప్రజా వ్యతిరేకతను మలుచుకునేందుకు గ్రామాలకు వస్తున్నారు. ప్రకాష్ గౌడ్ ఏ పార్టీ ప్రజా ప్రతినిధిగా వస్తారో... నియోజకవర్గ ప్రజలకు తెలపాలి అడుగడుగున నిలదీయండి. కానీ భౌతిక దాడులకు పాల్పడొద్దు.**

**బిఆర్ఎస్ యువ నేత కార్తీక్ రెడ్డి**



బిఆర్ఎస్ పార్టీ యువ నాయకులు, రాజేంద్రనగర్ ఆ పార్టీ ఇన్చార్జి పి. కార్తీక్ రెడ్డి.

రంగారెడ్డి : ఏప్రిల్ 15( ప్రభాత ఉదయం) అసత్య ప్రచారాలతో ప్రజల నమ్మించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.... ప్రభుత్వాన్ని నడపడం చేతకాక అదే అసత్యాలు నమ్ముకుంటూ రాష్ట్ర ప్రజలను మోసం చేస్తుందని బిఆర్ఎస్ యువ నేత రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్చార్జ్ కార్తీక్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. ప్రజా వ్యతిరేకత నుంచి బయట పడాలని గ్రామాల బాట పట్టానున్న కాంగ్రెస్ ప్రజా ప్రతినిధుల ఉద్దేశించి ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు.... ఏ మొహం పెట్టుకొని కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులు గ్రామాలకు వస్తున్నారని తీవ్రంగా మండిపడ్డారు. ప్రభుత్వం రాగానే వంద రోజుల్లో 6 గ్యారంటీలను అమలు చేస్తామని ఇచ్చినా హామీ ఏమైంది అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి రెండు సంవత్సరాలు గడుస్తున్నా కల్లబొల్లి మాటలతోనే కాలయాపన చేస్తుందని అన్నారు. రాష్ట్రంలో పరిపాలన గాడి తప్పిందని, 420 హామీలు ఆటకెక్కాయని, రియల్ ఎస్టేట్ వ్యవస్థ పూర్తిగా కుప్ప కూలిపోయిందని, హైడ్రాతో అలజడి సృష్టించి 13 మంది రియల్ ఎస్టేట్ వ్యాపారుల ఆత్మహత్యలకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం కారణమైందని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పరిపాలన గాడి తప్పి ప్రజల అవస్థలు పడుతుంటే రాష్ట్ర ముఖ్యమంత్రి కెసిఆర్ పై ఆరోపణలు చేస్తూ బిఆర్ఎస్ జపం చేయడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి దమ్ముంటే స్థానిక సంస్థల ఎన్నికలు వెంటనే పెట్టాలని డిమాండ్ చేశారు. ఎన్నికలు పెడితే ప్రజా వ్యతిరేకత ఏ స్థాయిలో ఉందో పసిగట్టిన ముఖ్యమంత్రి ఎన్నికలను వాయిదాలు వేస్తూ వస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో ఆర్థిక వ్యవస్థ ఆగమై రైతులకు ఇవ్వాల్సిన రైతుబంధు ఒక వాయిదను ఎగగొడుతున్నారని, రానున్న ఎన్నికల్లో రైతులే తగ్గిన బుద్ధి చెప్తారని కార్తీక్ రెడ్డి హెచ్చరించారు.

**అడుగడుగున నిలదీయండి.**

అసత్య ప్రచారాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులు మరోసారి ప్రజలను మభ్య పెట్టేందుకు గ్రామాల బాట పడుతున్నారని.... ఈ అబద్ధాల ప్రజా ప్రతినిధులను అడుగడుగున నిలదీయాలని కార్తీక్ రెడ్డి పిలుపునిచ్చారు. అస్సలు వీలు గ్రామాలలో ఓట్లు వేసిన ప్రజలకు ఏమి ఒరగబెట్టారని మళ్ళీ ప్రజల దగ్గరికి వస్తున్నారని ప్రజలే వారిని ప్రశ్నించాలని ఆయన కోరారు. వంద రోజుల్లో ఇస్తానన్న ఆరు గ్యారెంటీ ల గురించి, వృద్ధులకు, వితంతువులకు పెన్షన్లు పెంచుతామని, మహిళా మణులను కోటీశ్వరులు చేస్తామని, నోటిఫికేషన్లు ఎవరు ఇచ్చారు... ఉద్యోగాలు ఎలా వచ్చాయి, రెండు దఫాలుగా ఇచ్చే రైతుబంధు ఒకసారి కి మాత్రమే ఎందుకు మరిమితమైందో, ప్రభుత్వ భూములను కొల్లాగొడుతున్న కాంగ్రెస్ ప్రజా ప్రతినిధుల తీరుపై ఇలా చాలా సమస్యలపై గ్రామాల ప్రజలు, ప్రత్యేకంగా యువత గ్రామాలకు వచ్చే ప్రజా ప్రతినిధులను నిలదీయాలని కోరారు. గ్రామాలకు వచ్చే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రతినిధులను సామరస్యంగా, శాంతియుత మార్గంలో నిలదీయాలని, క్షణికావేశం కోల్పోయి భౌతిక దాడులకు పాల్పడొద్దని గ్రామ ప్రజలతోపాటు యువకులను ప్రత్యేకంగా కోరుతున్నట్లు ఆయన తెలిపారు.

**ప్రకాష్ గౌడ్ ఏ పార్టీ ప్రజా ప్రతినిధిగా వస్తారో....**

**నియోజకవర్గ ప్రజలకు తెలపాలి. కార్తీక్ రెడ్డి.**

ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకున్న కాంగ్రెస్ ఎమ్మెల్యేలు గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి వారి సమస్యలు పరిష్కరించి వ్యతిరేకత నుంచి బయటపడాలని సూచించిన రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాలను సారం... ప్రజల్లోకి వస్తున్న ఎమ్మెల్యేలతో పాటు మన రాజేంద్రనగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ఏ పార్టీ ప్రతినిధిగా ప్రజల ముందుకు వస్తారో తెలపాలని బిఆర్ఎస్ పార్టీ రాజేంద్రనగర్ ఇన్చార్జి కార్తీక్ రెడ్డి డిమాండ్ చేశారు. నమ్మకంతో ప్రజలు గెలిపించిన బిఆర్ఎస్ పార్టీ ప్రతినిధిగా వస్తున్నారా....? నమ్మిన ప్రజలను నట్టేట ముంచి రేవంత్ రెడ్డి సరసన చేరిన కాంగ్రెస్ ప్రతినిధిగా వస్తున్నారా....? ఓట్లేసి గెలిపించిన నియోజకవర్గ ప్రజలకు తెలపాలని కోరారు. మధ్యంతర ఎన్నికలు రావడం తధ్యమని అయితే ప్రకాష్ గౌడ్ చిత్తశుద్ధి ఉంటే ఎమ్మెల్యే పదవికి తక్షణమే రాజీనామా చేసి రావాలని సవాళ్లు విసిరారు. ప్రజాకేత్రంలో అంతిమ తీర్పు ప్రజలదేనని రానున్న మధ్యంతర ఎన్నికలలో ప్రజలే తగిన తీర్పిస్తారని కార్తీక్ రెడ్డి అన్నారు.

## నేటి నుంచి భూభారతి అవగాహన సదస్సులు

మొదటి పేజీ తరువాయి...

వికారాబాద్ జిల్లా పుదూరు గ్రామంలో జరిగే భూ భారతి చట్టం అవగాహన కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాల్గొననున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జరుగనున్న భూ భారతి చట్టం అవగాహన సదస్సులో జిల్లా కలెక్టర్లు, ఎమ్మెల్యేలు, రెవెన్యూ అధికారులు పాల్గొననున్నారు. ఏప్రిల్ 17 నుంచి జూన్ 2 వరకు భూ భారతి చట్టం పై అవగాహన సదస్సులు నిర్వహించనుంది ప్రభుత్వం. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఒక ప్రతిష్టాత్మకమైన కార్యక్రమం ఇది. దీని ప్రయోజనం రాష్ట్రంలో భూ నిర్వహణను సమర్థవంతంగా నిర్వహించడం , రైతులకు, పర్యావరణానికి అనుకూలంగా భూముల వినియోగాన్ని ప్రోత్సహించడం. ఈ కార్యక్రమం, తెలంగాణలో భూముల రిజిస్ట్రేషన్, భూమి చట్టాలు, ఆస్తి హక్కుల పునరుద్ధరణ వంటి ముఖ్యమైన అంశాలను కవర్ చేస్తుంది. భూ భారతి కార్యక్రమం ద్వారా, ప్రభుత్వమే భూముల ఖాతాలు, రికార్డులను సరికొత్తగా సృష్టించి వాటి మాలికల హక్కులను సులభంగా ప్రజలకు అందించేందుకు సహాయపడుతుంది. అంతేకాకుండా, ఇది రైతులకు భూములపై అనువైన పర్యవేక్షణను, కరెంట్ పొదుపు, పర్యావరణ పరిరక్షణ అంశాలు వంటి వాటిపై అవగాహన కూడా పెంచుతుంది.

## రైతు భరోసాతో పాటు సన్నాలకు 500 బోనస్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ

**ఎమ్మెల్యే కే ఆర్ నాగరాజు**

**రైతులు పండించిన ప్రతీ గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది**

వరంగల్ ,ఏప్రిల్ 16 ( ప్రభాత ఉదయం బ్యూరో): వరంగల్ జిల్లా వర్ధన్నపేట పట్టణ కేంద్రం లో డి సి ఓ సౌజన్యంతో సొసైటీ (పాక్స్)ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వడ్ల కొనుగోలు కేంద్రాన్ని , వర్ధన్నపేట టౌన్ పరిధిలోని ఫిరంగి గడ్డ నందు మల్లికార్జున గ్రామీఖ్య సంఘం (ఐకెపి) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వడ్ల కొనుగోలు కేంద్రాన్ని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ రైతులకు రైతు భరోసా అందిస్తూ సన్న వడ్లకు మార్కెట్ ధరతో పాటు 500 రూపాయల బోనస్ అందిస్తున్న దేశంలోనే ఏకైక రాష్ట్రం తెలంగాణ రాష్ట్రం అని తెలిపారు. రైతులకు నష్టం కలగకుండా, కొనుగోళ్లలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వాహకులు చూసుకోవాలని అన్నారు. రెండు రకాల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి దొడ్డు రకం, సన్న రకం వడ్లను వేరు వేరుగా కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ధాన్యం అమ్మిన రైతులకు రెండు, మూడు రోజులలో డబ్బులు జమ చేసేలా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. వర్ధన్నపేట నియోజకవర్గం లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను మహిళల ద్వారా నిర్వహించాలానే ఐ.కే.పీలను పాక్స్ కొనుగోలు కేంద్రాలను కేటాయించినట్లు తెలిపారు.



కొనుగోలు కేంద్రాలలో ఎలాంటి సమస్యలు వచ్చినా వెంటనే అధికారుల దృష్టికి తీసుకువెళ్ళాని, రైతులకు ఎలాంటి ఇబ్బంది రాకుండా చూసుకోవలని ఎమ్మెల్యే నాగరాజు సూచించారు. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట వ్యవసాయ మార్కెట్ చైర్మన్ నరుకుడు వెంకటయ్య, పాక్స్ చైర్మన్ రాజేష్ ఖన్నా, హనుమకొండ జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు పింగిలి వెంకట్రాం నరసింహారెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎద్దు సత్యనారాయణ, ఐకెపి నిర్వాహకులు జిల్లా అధికారులు, వ్యవసాయ శాఖ అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.




## కృష్ణవేణి టాలెంట్ స్కూల్ ప్రిన్సిపల్ మధుకర్ రావుకి బెస్ట్ ఎడ్యుకేటర్ అవార్డ్

వరంగల్ ,ఏప్రిల్ 16 (ప్రభాత ఉదయం బ్యూరో) రంగారెడ్డి జిల్లా షేక్ పేట కృష్ణవేణి టాలెంట్ స్కూల్ ప్రిన్సిపల్ మధుకర్ రావు కి ప్రతిష్టాత్మక బెస్ట్ ఎడ్యుకేటర్ అవార్డ్ దక్కింది. టైమ్ టు గ్రో ఇన్ అసోసియేషన్ విత్ గవర్నమెంట్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో ఈ పురస్కారాన్ని అందించారు. హైదరాబాద్ బంజారాహిల్స్ లోని రాడిసన్ హెూటల్లో 26వ ఎడ్యుకేషనల్ సమ్మిట్ 2025 కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో షేక్ పేట కృష్ణవేణి టాలెంట్ స్కూల్ ప్రిన్సిపల్ మధుకర్ రావుకు బెస్ట్ ఎడ్యుకేటర్ అవార్డ్ అందించారు. విద్యార్థుల గొప్ప భవిత కోసం, వారి సమగ్రాభివృద్ధి కోసం ప్రిన్సిపల్ మధుకర్ రావు చేస్తున్న కృషిని కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు ప్రశంసించారు. కృష్ణవేణి టాలెంట్ గ్రూప్ స్కూల్స్ చైర్మన్ ఛైర్మన్ ఎం.ఎం. షరీఫ్, ప్రెసిడెంట్ జైపాల్ రెడ్డి, ప్రిన్సిపల్ మధుకర్ రావుకు అభినందనలు తెలియజేశారు. తమ విద్యాసంస్థలో ప్రిన్సిపల్ గా పనిచేస్తున్న మధుకర్ రావుకు బెస్ట్ ఎడ్యుకేటర్ అవార్డ్ దక్కడం గర్వంగా ఉందని వారు తెలియజేశారు. తమ మేనేజ్ మెంట్ ఇస్తున్న సపోర్ట్ , పేరెంట్స్ సహకారం వల్లే తాను ఈ అవార్డ్ అందుకోగలిగానని ప్రిన్సిపల్ మధుకర్ రావు సంతోషాన్ని వ్యక్తం చేశారు.

## అక్రమ వలసదారులకు ట్రంప్ బంపర్ ఆఫర్

మొదటి పేజీ తరువాయి...

వీడియో చూసిన ట్రంప్.. ఇలాంటి వ్యక్తిని తమ దేశంలో ఉంచుకోవాలని అనుకున్నట్లు- చెప్పారు. ఇలాంటి వారి వల్ల ఎలాంటి ప్రమాదం ఉండదని కూడా చెప్పారు. వలసదారులను దేశం నుంచి పంపించడమే తమ ప్రథమ లక్ష్యమని, అయితే వారు ఉండడానికి అర్హులని తేలితే.. తిరిగి వెనక్కి తీసుకురావడానికి కూడా అనుమతి ఇస్తామని హామీ ఇచ్చారు. స్వీయ బహిష్కరణకు తుది ఉత్తర్వులు పొంది కూడా 30 రోజులు దాటి అమెరికాలో నివసిస్తున్న వారికి రోజుకు 998 డాలర్లు జరిమానాగా విధిస్తామని అమెరికా ప్రభుత్వం హెచ్చరించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా స్వీయ బహిష్కరణ వల్ల కలిగే ప్రయోజనాలను అధికారులు వివరించారు. స్వతహాగా దేశాన్ని విడిచిపెట్టి వెళ్లడం వెళ్లాలనేకునే వారికి సాయం అందిస్తామని చెప్పారు. తమ దేశాలకు వెళ్లే క్రమంలో చార్జీలను భరించలేకపోతే.. సబ్సిడీ విమాన సర్వీసుకు కూడా అర్హులవుతారని అధికారులు పేర్కొన్నారు.

# రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయము

**ఎమ్మెల్యే యశస్విని రెడ్డి**

**మద్దతు ధర కల్పించిన ఘనత కాంగ్రెస్ దే**

**పారదర్శకంగా ధాన్యం కొనుగోలు**



వరంగల్, ఏప్రిల్ 16 (ప్రభాత ఉదయం బ్యూరో): రైతు సంక్షేమమే ధ్యేయంగాకాంగ్రెస్ ప్రభుత్వం నిరంతర కృషి చేస్తుందని పాలకుర్తి నియోజకవర్గం ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అన్నారు.పాలకుర్తి మండల కేంద్రంలోని ఎఫ్ఎసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఎమ్మెల్యే యశస్విని రెడ్డి ప్రారంభించారు. తొలుత రైతులు, సంఘ ప్రతినిధులు, అధికారులు వారికి ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ రైతు సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అని, అన్నదాతలకు తగిన మద్దతు ధరను అందించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రం ద్వారా రైతులు తమ పంటను నేరుగా విక్రయించుకునే అవకాశం ప్రభుత్వం కల్పించిందని తెలిపారు. మధ్యవర్తులు లేకుండా, పారదర్శకంగా కొనుగోలు ప్రక్రియ సాగుతుందని అన్నారు. దీని వల్ల రైతులకు సమయానుకూలంగా చెల్లింపులు జరుగుతున్నాయని రైతులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం విక్రయించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.ప్రతి రైతుకు ఎంఎస్పి (తగిన మద్దతు ధర) అందేలా జాగ్రత్తలు తీసుకుంటామని, కొనుగోలు ప్రక్రియను పర్యవేక్షించేందుకు ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు .గ్రామీణ ప్రాంతాల్లో ఈ విధమైన కేంద్రాలు ఎక్కువగా ఏర్పాటవడం సంతోషకరమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన మాటలను నిలబెట్టుకుంటున్నదానికి నిదర్శనమని తెలిపారు. అనంతరం పాలకుర్తి నియోజకవర్గంఇంచార్జ్ ఝాన్సి రెడ్డి మాట్లాడుతూ రైతుల కష్టం వెలకట్టలేనిదని అన్నారు. ప్రభుత్వ సహకారంతో వారిని ఆర్థికంగా బలోపేతం చేయడానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉన్నామని తెలిపారు. రైతుల సమగ్రాభివృద్ధికి ధాన్యం కొనుగోలు కేంద్రాలు తోడ్పడుతుందని అన్నారు. ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ఇంకా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు త్వరలో చేపడతామని తెలిపారు.ఈ కార్యక్రమంలో పాలకుర్తి ఏఎంసీ చైర్మన్ మంజుల, బ్లాక్ అధ్యక్షులు రాపాక సత్యనారాయణ, మండల అధ్యక్షులు గిరగాని కుమారస్వామి గౌడ్, సొసైటీ చైర్మన్ బొబ్బల అశోక్ రెడ్డి, వైస్ చైర్మన్ కారు పోతుల వేణు గౌడ్, మాజీ ఎంపీపీలు కారు పోతుల శ్రీనివాస్ గౌడ్, గడ్డం యక సోమయ్య, సీనియర్ నాయకులు ఎర్రబెల్లి రాఘవరావు, యకంత రావు, కృష్ణ మూర్తి, పులి గణేష్ గౌడ్, కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర నాయకుడు గుగ్గిళ్ళ ఆదినారాయణ, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు గాదె పాక భాస్కర్, కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి భార్గవ్, మండల యూత్ అధ్యక్షులు హరీష్, ములుగురి యాకయ్య గౌడ్ డైరెక్టర్లు ఎండి నజీర్, పార్టీ సీనియర్ నాయకులు గూగుల్ కిషన్ నాయక్, పెనుగొండ రమేష్, పన్నీర్ వెంకన్న, తదితరులు, పాల్గొన్నారు.

# బస్సు షెల్టర్ల నిర్మాణము పూర్తి అయ్యేదెన్నడో?

## వేసవి కాలంలో బస్సుల కోసం షెల్టర్ లేక ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు...!

వరంగల్, ఏప్రిల్16 (ప్రభాతఉదయం బ్యూరో): వరంగల్ నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా స్మార్ట్ సిటీ ఏర్పాటులో భాగంగా త్రినగర్లో బస్ షెల్టర్లు ఏర్పాటు చేయడం జరిగింది. అయినప్పటికీ కొన్ని ముఖ్య ప్రాంతాల్లో బస్ షెల్టర్లు అసంపూర్తి నిర్మాణంతో ప్రయాణికులు వేసవికాలంలో నీడ లేక కూర్చోవడానికి సీట్లు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారు. వరంగల్ పోచం మైదాన్ చౌరస్తాలో అసంపూర్తి నిర్మాణంతో దర్శనమిస్తున్న బస్ షెల్టర్ కనిపిస్తుంది .ప్రయాణికులు ప్రతిరోజు వేల సంఖ్యలో బస్సుల కోసం ఎదురుచూస్తూ ఎండలో నిలబడటానికి ఇబ్బంది పడుతూ పక్క షాపులకు నీడ నిలవడానికి పరిస్థితి లేక అనేక అవస్థలు పడుతున్నామని విచారం వ్యక్తం చేస్తున్నారు. అలాగే కాకతీయ యూనివర్సిటీ చౌరస్తాలో కాజీపేటకు వెళ్లే మార్గంలో బస్సు షెల్టర్ అసంపూర్తి నిర్మాణంతో ప్రయాణికులు ఇబ్బందులు వర్ణనాతీతం .కాలేజీ విద్యార్థులు ప్రయాణికులు బస్సుల కోసం వేచి చూస్తూ కూర్చునే పరిస్థితి లేక ఎండలో నిలబడుతూ నానా అవస్థలు పడుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. వరంగల్, హనుమకొండ ,కాజీపేట పట్టణాల్లో ప్రతి బస్ స్టాప్ లో బస్ షెల్టర్ నిర్మించి వాటికి అడ్వర్టైజ్మెంట్ ద్వార ఆదాయం సమకూర్చుకునే అవకాశం కూడా ఉంది. అయినప్పటికీ ఈ రెండో ప్రధాన ప్రాంతాల్లో నిర్మాణం అసంపూర్తి దశలో మిగల్చడానికి కారణం ఏమిటో ప్రయాణికులకు అర్థం కావడం లేదని విచారం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా నగరపాలక సంస్థ నిర్మాణం పూర్తి చేసి ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు. బస్ షెల్టర్లు నిర్మించి ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించాలని ప్రత్యక్ష పార్టీలు కోరుతున్నాయి.





పార్లమెంటు మాజీ సభ్యులు వి. తులసీ రామ్ చిత్ర పటానికి నివాళులు అర్పిస్తున్న వి లలిత్ తదితరులు

# ప్రజల మనిషి తులసీరాం

బుద్వేల్, ఏప్రిల్16(ప్రభాత ఉదయం) : మూడు పర్యాయాలు పార్లమెంటు సభ్యునిగా పనిచేసిన దివంగత వి. తులసీరాం రాజేంద్రనగర్ ప్రాంతానికి ఎంతగానో సేవలందించారని ఆయన మనుమడు, యువజన కాంగ్రెస్ రాష్ట్ర మాజీ కార్యదర్శి వర్రి లలిత్ అన్నారు. వి.తులసీరాం వర్ధం తి సందర్భంగా బుధవారం రాజేంద్రనగర్ ఆంబేద్కర్ చౌరస్తాలో ఆయన చిత్రపటానికి స్థానిక దళిత నాయకులతో కలసి నివాళుర్పించారు. తులసీరాం సేవలను కొనియాడారు. రాజేంద్రనగర్ కు చెందిన వి. తులసీరాం మొదటి నుంచి గాందేయ వాది అని కొనియాడారు. సర్వోధయ ట్రస్టు సభ్యునిగా ఆ ట్రస్టు కు వచ్చే ఎంతో మంది కాంగ్రెస్ వాదులకు సేవలందించారని గుర్తు చేసుకున్నారు. పెద్దపల్లి, నాగర్ కర్నూల్ పార్లమెంటు నియోజకవర్గాలకు ఎంపీలుగా ఆయన సేవలు అందజేశారన్నారు. శివరాంపల్లి లో సర్వోదయ ట్రస్టు ఉందని, అక్కడికి మొదట్లో అనేక మంది కాంగ్రెస్ నాయకులు వచ్చేవారని గుర్తు చేశారు. ఆ సందర్భంలోనే శివరాంపల్లిలో నేషనల్ పోలీస్ అకాడమీ రావడానికి తులసీరాం కృషి ఎంతగానో ఉందన్నారు. హసన్ నగర్, శివరాంపల్లి ప్రాంతాలకు విద్యుత్ సౌకర్యం రావడానికి కూడా తులసీరాం కృషి ఉందన్నారు. రాజేంద్రనగర్ లో జరిగే మహనీయుల జయంతి వేడుకలకు ఆయన పెద్ద దిక్కుగా ఉండేవారన్నారు. కేంద్ర సఫారీ కర్మచారి సంఘం సభ్యునిగా ఉన్న సమయంలో ఆయన దళితుల జీవితాలలో వెలుగులు నింపారని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పి.శ్రీనివాస్, దాసరి రమేశ్, తదితరులు పాల్గొన్నారు.




నిరసన తెలుపుతున్న డాక్యుమెంట్ రైటర్లు

# పాత పద్ధతిలోనే రిజిస్ట్రేషన్‌లు చేయాలి

బుద్వేల్, ఏప్రిల్16(ప్రభాత ఉదయం) : సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలలో స్లాట్ విధానం వద్దని, పాత పద్దతి ప్రకారమే రిజిస్ట్రేషన్లు చేయాలని డాక్యుమెంటరీ రైటర్లు పేర్కొన్నారు. స్లాట్ విధానం వద్దని బుధవారం రాజేంద్రనగర్ లో ప్లకార్డులు పట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. గురువారం, శనివారాలలో డాక్యుమెంట్ రైటర్ కార్యాలయాలన్ని మూసివేస్తున్నట్లు ప్రకటించారు. నిరసన కార్యక్రమంలో కె. నర్సింహులు గౌడ్, యాదగిరి, జీవన్ రెడ్డి, శర్మ, రఫీ, కోరని క్రాంతికుమార్, ఖదీర్, రమేశ్, సాయినథ్, పవన్, ఇస్లాం, ప్రభాకర్ రెడ్డి, బలరాం, జుబైర్, కె.మల్లేశ్, శ్యాంసుందర్, శ్యామ్, ఆనంత్ పాల్గొన్నారు.




ఎం ఎ నయీం కు కండువా కప్పి కాంగ్రెస్ పార్టీ లోకి ఆహ్వానిస్తున్న ఆ పార్టీ రాష్ట్ర నాయకులు సంపత్. చిత్రంలో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి , ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బి. జ్ఞానేశ్వర్ ముదిరాజ్ లు

# కాంగ్రెస్ పార్టీలో చేరిన రాజేంద్రనగర్ తాలూకా ఉద్యోగ సంఘాల జేఏసీ మాజీ చైర్మన్ ఎం ఎ నయీం

శంషాబాద్, ఏప్రిల్ 16(ప్రభాత ఉదయం): రాజేంద్రనగర్ తాలూకా ఉద్యోగ సంఘాల జేఏసీ మాజీ చైర్మన్, రాజేంద్రనగర్ వాస్తవ్యులు ఎం ఎ నయీం కాంగ్రెస్ పార్టీలో చేరారు . బుధవారం సాయంత్రం శంషాబాద్ బేగం ఫంక్షన్ హాల్ లో జరిగిన కాంగ్రెస్ పార్టీ బహిరంగ సభలో ఆయన అ పార్టీ రాష్ట్ర నాయకులు సంపత్, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్, రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, ముదిరాజ్ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ బి . జ్ఞానేశ్వర్ ముదిరాజ్ తదితరుల సమక్షంలో కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా సంపత్ ఆయనకు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.



# కులాంతర వివాహ ప్రోత్సాహక బహుమతిని అందజేసిన జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్

గద్వాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 16(ప్రభాత ఉదయం)కులాంతర వివాహం చేసుకున్న జంటకు బుధవారం ఐడీఓసీ కార్యాలయంలోని తన ఛాంబర్ నందు ఎస్సీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రోత్సాహక బహుమతిని జిల్లా కలెక్టర్ బి.ఎం. సంతోష్ మంజూరు చేయడం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,ప్రభుత్వ సంక్షేమ పథకాలను పూర్తిగా వినియోగించుకోవాలని సూచించారు.గద్వాల పట్టణానికి చెందిన శ్రీమతి టి.యం. మౌనిక (వైఫ్ ఆఫ్ కె.రమేష్ ) ఎస్సీ కులాంతర వివాహం చేసుకున్నందుకు,ప్రభుత్వ కల్పించిన పథకం ద్వారా రూ. 2,50,000 ప్రోత్సాహక బహుమతిని మంజూరైనట్టు తెలిపారు. ఈ మొత్తాన్ని షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ద్వారా ఫిక్స్‌డ్ డిపాజిట్ రూపంలో జంటకు బాండ్‌ను అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి సరోజ సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



శివరాంపల్లి లోని గౌతమ్ మోడల్ స్కూల్ కు తాళం వేస్తున్న రాజేంద్రనగర్ మండల విద్యాశాఖ సిబ్బంది

# శివరాంపల్లి గౌతమ్ మోడల్ స్కూల్‌కు తాళం

బుద్వేల్, ఏప్రిల్16(ప్రభాత ఉదయం) : ఎలాంటి అనుమతులు లేకున్నప్పటికి శివరాంపల్లి లో గౌతమ్ మోడల్ స్కూల్ పేరుతో ఒకటవ తరగతి నుంచి 8వ తరగతి వరకు నిర్వహిస్తున్నారని వచ్చిన ఫిర్యాదుల మేరకు రాజేంద్రనగర్ మండల విద్యాశాఖాధికారి కార్యాలయం సిబ్బం ది బుధవారం ఆ పాఠశాల భవనానికి తాళం వేశారు. రాజేంద్రనగర్ మండలంలో అనుమతి లేని పాఠశాలలతో పాటు సీబీఎస్ఈ సిలబస్ ప్రకారం బోధన చేపట్టాలనే అనుమతులు లేకున్నప్పటికీ కొందరు సీబీఎస్ఈ సిలబస్ అంటు పాఠాలు చెబుతున్నారని టీఎస్ఎస్ఓ సంస్థ ప్రతినిధులు ఇటీవల రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. ప్రైవేటు పాఠశాలలో ఎక్కువ మొత్తంలో డబ్బులు వసూలు చేసి పుస్తకాల విక్రయాలు జరుపుతున్నారని కూడా ఫిర్యాదు లో పేర్కొన్నారు. దీంతో స్పందించిన మండల విద్యాశాఖాధికారి శంకర్ రాథోడ్ శివరాంపల్లిలో అనుమతులు లేకున్నా, పాఠశాల నిర్వాహణకు ముందుకు వచ్చిన గౌతమ్ మోడల్ స్కూల్ యాజమాన్యంపై విద్యాశాఖ అధికారులు చర్యలు చేపట్టారు. స్కూల్ కు బుధవారం తాళం చేశారు.

### హర్షం వ్యక్తం చేసిన టీఎస్ఎస్ఓ అధ్యక్షుడు మీసాల లక్ష్మీనివాస్

రాజేంద్రనగర్ సర్కిల్ లో అనుమతులు లేకున్నా పాఠశాల నిర్వహించడానికి ప్రయత్నిస్తున్నారని తెలుసుకున్న గౌతమ్ మోడల్ స్కూల్ కు బుధవారం రాజేంద్రనగర్ మండల విద్యాశాఖ అధికారులు తాళం వేయడం సంతోషకరమని తెలంగాణ సామాజిక విద్యార్థి సంఘం అధ్యక్షుడు మీసాల లక్ష్మీ నివాస్ అన్నారు. ప్రైవేటు పాఠశాలలపై విద్యాశాఖ అధికారులు నిఘా పెట్టాలన్నారు.

# డివిజన్-18 లైన్‌మెన్లలతో ఎండీ జూమ్ మీటింగ్

ఖైరతాబాద్, ఏప్రిల్ 16(ప్రభాత ఉదయం) జలమండలి డివిజన్ 18 పరిధిలోని లైన్ మెన్ల లతో ఎండీ అశోక్ రెడ్డి జూమ్ మీటింగ్ నిర్వహించారు.. ఈ మీటింగ్ లో డివిజన్ లో పనిచేస్తున్న లైన్ మెన్ల వివరాలు..ఒక్కో ఒక్కో లైన్ మెన్ ఇన్ని వాల్వ్ లను ఆపరేట్ చేస్తారో వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఉన్న వారితోనే ప్రజలకు నీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బంది లేకుండా పనులు ఎలా చేయాలో ఈ సందర్భంగా ఎండీ చర్చించారు. అలాగే ప్రతి లైన్‌మన్ ఆధీనంలో ఉన్న ఆపరేషన్ వాల్వ్‌ల సంఖ్య తగ్గించడం.. నీటి సరఫరా చేసే %జాాచీ% నంబర్లను తగ్గించడానికి, వాల్వ్ ఆపరేషన్ సమయాన్ని తగ్గించడం తదితర అంశాలపై లైన్ మెన్లతో మాట్లాడారు. వీటితోపాటు మెట్రో కస్టమర్ లో నమోదు అయ్యే సమస్యలను త్వరితగతిన పరిష్కరించడానికి తీసుకోవాల్సిన చర్యలను జీఎంను అడిగి తెలుసుకున్నారు. ఈ జూమ్ మీటింగ్ లో జలమండలి ఈడీ మయాంక్ మిట్టల్, ఈఎన్సీ- డైరెక్టర్ ఆపరేషన్ -2 వివిల్ ప్రవీణ్ కుమార్, జీఎం, డీజీఎం ఇతర అధికారులు పాల్గొన్నారు.

# వర్సిటీ భూములపై సర్కార్‌కు చెంపదెబ్బ

మొదటి పేజీ తరువాయి...

స్పష్టం చేశారు. అవసరమైతే 2400 ఎకరాల్లో ఒక్క చెట్టు కూడా కొట్టకుండా ఆదేశాలివ్వాల్సి వస్తుందని తెలిపారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు విరుద్ధంగా వ్యవహరిస్తే ఊరుకోమని జస్టిస్ గవాయి హెచ్చరించారు. భూముల మార్టిగేజ్‌తో తమకు సంబంధం లేదని.. చెట్ల నరికివేత గురించే తాము మాట్లాడుతున్నామని చెప్పారు. కంచ గచ్చిబౌలిలో అడవులు లేవని వాదిస్తే.. అదే ప్రాంతంలో జైలు కట్టి అందులోనే అధికారులను పెట్టాల్సి ఉంటుందని జస్టిస్ బీఆర్ గవాయి హెచ్చరించారు. చెట్లు కొట్టేసే ముందు అనుమతి ఉందా లేదా అన్నదే ముఖ్యమని తెలిపారు. అనుమతులు లేకుండా చెట్లు- కొట్టేసినందుకు సీఎస్ సహా అధికారులు జైలుకు వెళ్లాల్సి ఉంటుందని హెచ్చరించారు. సీఎస్‌ను కాపాడాలనుకుంటే.. వంద ఎకరాలను ఎలా పునరుద్ధిస్తారో చెప్పాలన్నారు. పునరుద్ధరణ ఎలా చేస్తారు? ఎంతకాలంలో చేస్తారు? జంతు జాలాన్ని ఎలా సంరక్షిస్తారో స్పష్టంగా చెప్పాలని ఆదేశించారు. దీనిపై నాలుగు వారాల్లో ప్రణాళిక ఫైల్ చేయాలని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. తెలంగాణలో వాల్టా చట్టం అమలులో ఉందని, దాని ప్రకారం స్వయం అనుమతులుగా ప్రభుత్వం వ్యవహరించిందని అమికస్ క్యూరీ సుప్రీంకు వివరించారు. పర్యావరణాన్ని కాపాడటానికి మేము ఇక్కడ ఉన్నాం. అధికారుల అనుమతి లేకుండా ఎన్ని చెట్లను నరికివేశారో అనే ఆందోళన మాత్రమే ఉంది. చెట్లను ఎలా పునరుద్ధరిస్తారో చెప్పాలి. మేము బుల్డోజర్ ఉనికి, 100 ఎకరాల అడవిని తొలగించడం గురించి మాత్రమే ఆందోళన చెందుతున్నాం. వీరీరు నిర్మించాలనుకుంటే, వీరీరు అనుమతులు తీసుకొని ఉండాలి అని జస్టిస్ అన్నారు. 2004 నుంచి ఈ భూముల వ్యవహారం, కోర్టుల్లో ఉన్న పరిస్థితి, తర్వాత చుట్టుపక్కల జరిగిన అభివృద్ధి, ఐటి పార్కు, ఇతర ప్రాజెక్టులకు సంబంధించిన వివారలను కోర్టుకు చెప్పారు. అయితే వంద ఎకరాల్లో జరిగిన నష్టాన్ని ఎలా పూడ్చాలన్న విషయం పైనే మేము దృష్టి సారించాలని అంటున్నామని జస్టిస్ గవాయ్ అన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం ఏమైనా చేస్తాం.ఆ భూముల్లో ఉన్న జంతుజాలాన్ని ఎలా సంరక్షిస్తారో చెప్పాలన్నారు. ఆర్టికల్ 142 కింద పర్యావరణ పరిరక్షణ కోసం ఏమైనా చేస్తాం. పునరుద్ధరణను అడ్డుకునే ప్రయత్నం చేస్తే, వీరీ అధికారులను తాత్కాలికంగా జైలుకు పంపిస్తాం అని కఠినంగానే అన్నారు. 100 ఎకరాల్లో జరిగిన నష్టం కారణంగా ప్రభావితమైన వన్యప్రాణులను రక్షించేందుకు అవసరమైన తక్షణ చర్యలను పరిశీలించి, అమలులోకి తీసుకురావాలని తెలంగాణ వన్యప్రాణి సంరక్షణాధికారిని సుప్రీం ధర్మాసనం ఆదేశించింది. పునరుద్ధరణ ఎలా చేస్తారు, ఎంత కాలంలో చేస్తారు, జంతు జలాన్ని ఎలా సంరక్షిస్తారో స్పష్టంగా చెప్పాలని తెలంగాణ ప్రభుత్వాన్ని సుప్రీం ఆదేశించింది. నాలుగు వారాల్లో ప్రణాళిక ఫైల్ చేయాలని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది ధర్మాసనం. కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంలో స్టేటస్ కో కొనసాగించాలని ఆదేశాల్లో పేర్కొంది. తదుపరి విచారణను మే 15కు సుప్రీం కోర్టు వాయిదా వేసింది.

# పాత కర్నూల్ రైల్వే అండర్ పాస్‌లోకి కాలుష్య, మురుగునీరు రాకుండ చర్యలు తీసుకోవాలి



పాత కర్నూల్ రోడ్డులో గల రైల్వే అండర్ పాస్ లో దుర్గంధం



ఆనంద్ నగర్ నుంచి రైల్వే అండర్ పాస్‌లోకి వస్తున్న కాలుష్య జలాలు, మురుగు నీరు

బుద్వేల్, ఏప్రిల్ 16(ప్రభాత ఉదయం) : కోట్లాది రూపాయలతో పాత కర్నూల్ రోడ్డులో నిర్మిం చిన రైల్వే అండర్ పాస్ లోకి ప్రతి రోజు ఆనంద్ నగర్ లో గల పరిశ్రమల నుంచి వచ్చే కాలుష్య వ్యర్థ జలాలతో పాటు మురుగునీరు వలన అండర్ పాస్ బ్రిడ్జికి ప్రమాదం పొంచి ఉంది. కాలుష్య రసాయన జలాల వల్ల బ్రిడ్జి సామర్థ్యం క్షీణించి త్వరగా కూలిపోయే ప్రమాదం ఉంటుం ది. అంతేకాకుండ అండర్ పాస్ లోకి ప్రతి రోజు మురుగునీరు కూడా వస్తుండటంతో ఆ రోడ్డు లో ప్రయాణించే వాహనదారులు ప్రతి రోజు ఇబ్బందులకు గురౌతున్నారు. దుర్వాసనతో పాటు ఆ రోడ్డు గూండా పోయే ద్విచక్ర వాహనదారులు దుర్వాసనకు తట్టుకోలేకపోతున్నారు. బట్టలపై పడి దుస్తులు కూడా పాడై పోతున్నాయని వాపోతున్నారు. దీనిపై రాజేంద్రనగర్ జీహెచ్ఎంసీ అధికారులు స్పందించి పాత కర్నూల్ రోడ్డులోని రైల్వే అండర్ పాస్ లో కి పరిశ్రమల నుంచి, నివాసాల నుంచి కాలుష్య, మురుగు నీరు రాకుండ చూడాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

# ఉమిత్యాల తండాలో తాగునీటి ఎద్దడి



కేటీదొడ్డి, ఏప్రిల్ 16(ప్రభాత ఉదయం) కేటీదొడ్డి మండలంలోని ఉమిత్యాల తండా గ్రామంలో తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉందని గ్రామస్తులు వాపోతున్నారు. గ్రామంలో రెండు, మూడు రోజులు గా ఇదే పరిస్థితి ఏర్పడిందన్నారు. మిషన్ భగీరథ ద్వా రా గ్రామానికి తాగునీటిని అందించేవారు. అయితే కొన్ని వార్డులకు సరఫరా కాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆయా వార్డుల ప్రజలు తాగునీటి కోసం వ్యవసాయ బోర్లు, చేతి పంపులను ఆశ్రయించి నీటిని తెచ్చుకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యను పరిష్కరించాలని పలుమార్లు అధికారులను కోరుతున్నా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు. దీనిపై ఎంపీఓ కృష్ణమోహహన్ ను వివరణ కోరగా... తండాలో పూర్తి స్థాయిలో తాగునీటిని అందిస్తున్నట్లు, తాగునీటి సరఫరా చేసే పైప్ లైన్ లో చెత్తపేరుకపోయిందని, క్లీన్ చేస్తున్నట్లు తెలిపారు.



అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన ఎంపీ డీకే అరుణ

## దేవరకద్ర పట్టణానికి రైల్వే అండర్ బ్రిడ్జ్ మంజూరు: ఎంపీ డీకే అరుణ

మహబూబ్ నగర్, ఏప్రిల్ 16(ప్రభాత ఉదయం) మహబూబ్ నగర్ పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణ , దేవరకద్ర నియోజకవర్గ బిజెపి ఇన్చార్జ్ కొండ ప్రశాంత్ రెడ్డి దక్షిణ మధ్య రైల్వే ఉన్నత అధికారులతో సమావేశం అయి దేవరకద్ర నియోజకవర్గంలోని దేవరకద్ర పట్టణం 73 కౌకుంట్ల మండలంలోని 81,82 రైల్వే గేట్ లకు సంబందించి అండర్ బ్రిడ్జ్ నిర్మాణం గురించి సమీక్ష సమావేశం నిర్వహించడం జరిగింది.సానుకూలంగా స్పందించిన రైల్వే అధికారులు దేవరకద్ర పట్టణ కేంద్రంలో గల 73 రైల్వే గేట్ కి రైల్వే అండర్ బ్రిడ్జ్ మంజూరు చేసి నిధులు కేటాయించడం జరిగింది.త్వరలోనే నిర్మాణ పనులు ప్రారంభిస్తామని రైల్వే అధికారులు తెలియజేశారు.కౌకుంట్ల మండలంలో గల 81,82 గేట్లకు సంబంధించి త్వరలోనే ఉన్నత అధికారులతో చర్చించి వాటిని కూడా మంజూరు చేస్తామని తెలియజేశారు.



## ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌లు పరిశీలన

గద్వాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 16(ప్రభాత ఉదయం)ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్ వద్ద భద్రత పటిష్టంగా ఉండాలని జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ అన్నారు. జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలో గల గోదాములో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు (ఈవీఎం) లను భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్ ను జిల్లా కలెక్టర్ సంతోష్ బుధవారం సంబంధిత అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి తనిఖీ చేశారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి నెలకు ఒకసారి నిర్వహించే సాధారణ తనఖీలో భాగంగా కలెక్టర్ ఈ తనిఖీ నిర్వహించారు.గద్వాల జిల్లాకు సంబంధించిన ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్ తో పాటు భద్రత నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా స్ట్రాంగ్ రూమ్ నిర్వహణకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. స్ట్రాంగ్ రూమ్ భద్రతలో భాగంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పనితీరును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ కరుణాకర్, సురేష్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.



## ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

గద్వాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 16(ప్రభాత ఉదయం)ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తూ బడులను నిర్వహిస్తున్న ప్రైవేటు పాఠశాలల పై చర్యలు తీసుకోవాలని యుఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి వామన్ పల్లి రంగస్వామి పీడిఎస్ యు జిల్లా అధ్యక్షులు హలీం పాషా లు డిమాండ్ చేశారు. బుధవారం ఎంఈఓ శ్రీనివాస్ గౌడ్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో ప్రభుత్వ నిబంధనాల ప్రకారం ప్రైవేటు పాఠశాలలో ఒంటి పూట బడులు మధ్యాహ్నం వరకే నిర్వహించాలని నిబంధనలో ఉన్న ప్రైవేటు పాఠశాల యాజమాన్యం ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కుతూ ఉదయం నుంచి సాయంత్రం వరకు పాఠశాలలు నడుపుతున్నారని ఆరోపించారు. ప్రైవేటు స్కూల్ యాజమాన్యల ఆగడాలకు అడ్డు అదుపు లేకుండా పోతుందని, ఫీజుల విషయంలో తల్లిదండ్రులను అడగకుండా క్లాస్ రూమ్ లో విద్యార్థులను నిలబెట్టి తోటి విద్యార్థుల ముందు విద్యార్థిలను అవమానించి మానసిక ఇబ్బందికి గురి చేస్తున్నారన్నారు. ఫీజులు కట్టని తల్లిదండ్రుల పిల్లలకు లెటర్లు రాసి ఇంటి దగ్గర మీ తల్లిదండ్రులకు చూపెట్టండి అనీ నోటీసులు జారీ చేస్తున్నారని అన్నారు. జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో నూతన విద్యా సంవత్సరం 2025-2026 ముందస్తు అడ్మిషన్లు తీసుకుంటున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే గద్వాల పట్టణ కేంద్రంలో ఉన్నటువంటి ప్రైవేట్ పాఠశాలలు మౌలిక వసతులు లేనటువంటి పాఠశాలలపై ఆట స్థలాలు ఫైర్ సేఫ్టీ లేని పాఠశాలను 2026 విద్యా సంవత్సరానికి అనుమతులు ఇవ్వకుండా రద్దు చేయాలని కోరారు. గద్వాల పట్టణ కేంద్రంలో ఫ్లెక్సీలతో హోర్డింగ్లతో ప్రైవేట్ పాఠశాలలు ప్రచారాలను అడ్డుకోవాలని విద్యార్థి సంఘం నాయకులు ఎంఈఓ ను కోరినట్లు తెలిపారు.

# పక్కనోళ్ల నీటినీ మీరే వాడేస్తే.. వాళ్ల పరిస్థితి ఏంటి!

**మోటార్లను వాడుతున్న వారిపై ఎండీ అశోక్ రెడ్డి ఆగ్రహం.**

**రెండో రోజు కొనసాగిన మోటార్ ఫ్రీ టాప్ డ్రైవ్.**

**ఎస్సార్ నగర్ లోని మధురా నగర్ లో పర్యటించిన ఎండీ అశోక్ రెడ్డి**

**పలు హాస్టల్ లు, నివాసాల నుంచి మోటార్లు సీజ్ చేసిన అధికారులు.**

**వ్యవసాయానికి వాడే మోటర్లతో నీటిని తోడుతున్న వైనం.**

**మళ్ళీ తప్పు చేస్తే నల్లా కనెక్షన్ తొలగించాలని అధికారులకు ఆదేశించిన ఎండీ.**

**ఈ రోజు 32 ఇల్లీగల్ మోటార్లు స్వాధీనం.. 38 మందికి పెనాల్టీ విధింపు.**

**ఈ డ్రైవ్‌తో ప్రెజర్ పెరగడంతో ఆనందం వ్యక్తం చేస్తున్న లో లైన్ వినియోగదారులు.**



నల్లా కనెక్షన్ కు మోటార్ తో నీటిని తోడుతున్న ఇంటిని తనిఖీ చేసిన జలమండలి ఎండి అశోక్ రెడ్డి



2) స్వాధీనం చేసుకున్న మోటార్లు

ఖైరతాబాద్, ఏప్రిల్ 16 (ప్రభాత ఉదయం) జలమండలి సరఫరా చేసే నీటిని అక్రమంగా మోటార్లతో తోడుతున్న వారిపై జలమండలి చేపట్టిన డ్రైవ్ పై ఎండీ అశోక్ రెడ్డి దృష్టి సారించారు. మోటార్ ఫ్రీ టాప్ డ్రైవ్ ప్రారంభించిన రెండో రోజూ క్షేత్ర స్థాయిలో పర్యటించారు. జలమండలి ఓ అండ్ ఎం డివిజన్ 6, ఎస్ ఆర్ నగర్ లోని మధురానగర్ పరిసర ప్రాంతాల్లో బుధవారం ఆయన పర్యటించారు. బుధవారం ఎస్ ఆర్ నగర్, మధురానగర్ లో ముఖ్యంగా హాస్టళ్లు, వాణిజ్య సముదాయాలు ఉన్న ప్రాంతంలో లో-ప్రెషర్ తలెత్తుతున్న ప్రాంతాలలో ఇంటింటికి వెళ్లి తనిఖీలు చేశారు. కొందమంది వినియోగదారుల ఇండ్లలో అక్రమంగా మోటార్లు వినియోగిస్తూ పట్టుబడగా వారి మోటార్లను సీజ్ చేసి పెనాల్టీ విధించారు. ఈ నేపథ్యంలో ఎండీ అశోక్ రెడ్డి ఓ హాస్టల్ ప్రాంగణంలోకి వెళ్ళగా.. ఆ యజమాని తన నల్లాకు వ్యవసానికి వినియోగించే 2 హెచ్ పి మోటర్ తో నీటిని తోడడంతో యజమానిపై ఆగ్రహం వెలిబుచ్చారు. పది ఇళ్లకు సరిపడా నీటిని నువ్వు ఒక్కడే వాడితే మిగతా వాళ్ళకి ఏమైపోవాలి ప్రశ్నించారు. మరోసారి ఇలాంటి తప్పు చేస్తే క్రిమినల్ కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. అలాగే ఆ హాస్టల్ కు నెలవరకు నీటిని నిలిపివేసి, ట్యాంకర్ సైతం బుక్ చెయ్యకుండా బ్లాక్ లిస్ట్ లో పెట్టాలని అధికారులను ఆదేశించారు. ఇదే ప్రాంతంలో మరో భవనానికి సైతం వ్యవసాయ మోటార్ వాడుతూ పట్టుపడగా కనెక్షన్ తొలగించి, నెలవరకు ట్యాంకర్ కూడా సరఫరా నిలిపివేయమని ఎండీ అధికారులకు సూచించారు. ఈ డ్రైవ్ ఎస్ ఆర్ నగర్ ప్రాంతంలో వారం పాటు ప్రతిరోజూ వాటర్ సప్లై సమయంలో తనిఖీ చేసి మోటార్లు వినియోగించకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే ఈ డ్రైవ్ మరో 60 రోజుల వరకు నగరం అంతా కొనసాగుతుందని మోటార్లు బిగించి పట్టుబడితే మోటార్లు సీజ్ చేస్తారని, రెండోసారి కొనసాగిస్తే రూ.5 వేలు జరిమానా విధించి కేసులు నమోదు చేస్తారు. కాబట్టి వినియోగదారులెవరూ నల్లాకు మోటార్లు బిగించవద్దని ఈ సందర్భంగా ఎండీ హెచ్చరించారు. ఈ మోటార్ ఫ్రీ టాప్ డ్రైవ్ లో జలమండలి ప్రధానంగా రెండు అంశాలపై దృష్టి సారించింది. హైదరాబాద్ నగరంలో లో ప్రెజర్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడంతో నీటి వృధాను అరికట్టాలని చర్యలు చేపట్టడం. నగరమంలో నిన్న ప్రారంభమైన డ్రైవ్ తక్కువ ప్రెజర్ ఉన్న ప్రాంతాలు.. మోటార్ల వాడకం ఎక్కువగా ఉన్న కాలనీలు.. ప్రాంతాలలో జలమండలి ఉన్నత అధికారులనుంచి కిందస్థాయి ఉద్యోగివరకు పర్యటించి 175 ఇల్లీగల్ మోటర్లని గుర్తించి 64 ఇల్లీగల్ మోటార్లు సీజ్ చేసి మరో 84 మందికి నీటి వృధా చేసినందుకు పెనాల్టీ విధించారు. కాగా ఇప్పటివరకు పైన ఉన్న వినియోదారులు అక్రమంగా మోటార్లు ఉపయోగించి నీటిని తోడడంతో లో లైన్ కుటుంబాలకు లో ప్రెజర్ లో సరఫరా కావడంతో నీరు సరిపోక ఇబ్బంది పడేవారు.. ఇప్పడు జలమండలి అధికారులు మోటార్లను తొలగించడంతో వారికి సరైన ప్రెసర్ తో నీటి అందడంతో వాళ్లకు ఆనందం వ్యక్తం చేసి జలమండలి అధికారులను అభినందించారు. మోటార్ ఫ్రీ టాప్ డ్రైవ్ లో రెండో రోజు ఇప్పటివరకు అన్ని డివిజన్ లలో కలిపి మొత్తం 134 ఇల్లీగల్ మోటర్లని గుర్తించి 32 సీజ్ చేయగా మరో 38 మంది వినియోగదారులకు అక్రమంగా మోటార్లు ఉపయోగించినందుకు.. నీటి వృధా చేసినందుకు పెనాల్టీ విధించారు. అత్యధికంగా ఓ అండ్ ఎమ్ డివిజన్ లో 6 ఎస్ఆర్ నగర్ పరిధిలో 20 మోటార్లు సీజ్ చేసి పెనాల్టీ వేశారు. ఈ కార్యక్రమంలో జలమండలి సివిఓ గ్యానేందర్ రెడ్డి, సిఐ లక్మారెడ్డి, జీఎం హరి శంకర్, డీజీఎంలు ఇతర అధికారులు పాల్గొన్నారు.

**జలమండలి విజ్ఞప్తి:**

జలమండలి వినియోగదారులు ఎవరైనా తమ నల్లాలకు మోటార్లు బిగించి పట్టుబడితే.. వారిపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవడంతో పాటు మోటార్లు సీజ్ చేస్తారు. రెండోసారి మోటార్ తో నీటిని తోడితే రూ.5 వేలు జరిమానా విధించి కేసులు నమోదు చేస్తారు. కాబట్టి వినియోగదారులెవరూ నల్లాకు మోటార్లు బిగించవద్దని ఆలా చేయడంతో మిగితా వినియోగదారులకు లో ప్రెషర్ తో నీటి సరఫరా కావడంతో ఇబ్బంది పడతారు. అలాగే నీటి సరఫరా అవరాలకు సరిపోక ట్యాంకర్ బుక్ చేస్తున్నారని.. దీంతో ట్యాంకర్ డిమాండ్ పెరుగుతుంది కాబట్టి మోటార్లు బిగించవద్దని జలమండలి విజ్ఞప్తి చేస్తోంది.

ఒకవేళ తక్కువ ప్రెజర్ తో నీరు సరఫరా అయినా.. లేదా నీటి సరఫరాలో ఏవైనా ఇతర సమస్యలు తలెత్తినా.. తమకు దగ్గర్లోని సంబంధిత మేనేజర్, డీజీఎం, జీఎం అధికారులను సంప్రదించాలి. లేదా జలమండలి కస్టమర్ కేర్ నంబరు 155313 కి ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చు. వాటిపై తప్పకుండా తగిన చర్యలు తీసుకుని సమస్యల్ని పరిష్కరిస్తారు.

## గద్వాల తపాలా కార్యాలయం ముందు కాంగ్రెస్ నాయకుల ధర్నా






గద్వాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 16(ప్రభాత ఉదయం)నేషనల్ హెరాల్డ్ విషయంలో కక్ష పూరితంగా ఏఐసిసి అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ పేర్లను చార్జ్ షీట్ లో చేర్చడాన్ని నిరసిస్తూ టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆదేశానుసారం లిబుధవారం జిల్లా కేంద్రంలోని తపాల కార్యాలయం ముందు జెడ్పి మాజీ చైర్ పర్సన్ ఇంచార్జీ సరిత అధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలో కాంగ్రెస్ పార్టీ పట్ల ప్రజల్లో ఆదరణ పెరుగుతున్న కారణంగా కేంద్ర బిజెపి ప్రభుత్వం ఏఐసిసి అగ్ర నేత లపై కక్ష పూరితంగా చార్జ్ షీట్ లో చేర్చడం విడ్డూరమన్నారు.కాంగ్రెస్ పార్టీ అగ్ర నేతల పేర్లను వెంటనే తొలగించాలని లేనిపక్షంలో ఆందోళన చెప్పడుతామని కేంద్ర బిజెపి ప్రభుత్వాని హెచ్చరించారు. ప్రధాని నరేంద్ర మోడీ రాజకీయ కక్ష సాధింపు ధోరణి మానుకోవాలని లేనిపక్షంలో ప్రజలు తగిన బుద్ధి చెప్పే సమయం ఆసన్నమైందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ మాజీ చైర్మన్ బి.ఎస్.కేశవ్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ గంజిపేట్ శంకర్, పట్టణ అధ్యక్షుడు మహ్మద్ ఇసాక్ నాయకులు గోనుపాడు శ్రీనివాస్ గౌడ్, డి.ఆర్.శ్రీధర్, భాస్కర్ యాదవ్, టిఎన్ఆర్ జగదీష్, పాతపాలెం ఆనంద్ గౌడ్, రంజిత్ కుమార్, జయకృష్ణ, ఆరగిద్ద బాలకృష్ణ నాయుడు, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఆర్.తిరుమలేష్, జిల్లా జనరల్ సెక్రటరీ యేసు,కృష్ణమూర్తి, దడవాయి నర్సింహులు, దౌలన్న,కౌసర్ బేగ్, కుమ్మరి నారాయణ,దినేష్,బి.ఆర్.ఇమ్మనేయిల్, రాము,కపట్రాల వెంకట్రాములు,ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



## ఉపాది హామీలో భాగంగా బాలల సంరక్షణపై అవగాహన కార్యక్రమం

గద్వాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 16(ప్రభాత ఉదయం)మహిళాభివృద్ధి, శిశు సంరక్షణ జిల్లా శాఖ ఆధ్వర్యంలో బుధవారం అయిజ మండలం బింగిదొడ్డి గ్రామంలో బాలల హక్కులు , సంరక్షణ పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీపీవో నరసింహ మాట్లాడుతూ... 1098 అను నెంబర్ బాలలకు గల సమస్యలను పరిష్కరించడం కోసం 24 గంటలు అందుబాటులో ఉంటుందన్నారు. జిల్లాలో ఎక్కడైనా బాల్యవివాహాలు కానీ బాల కార్మికులుగా పనిచేస్తున్న పిల్లలు గానీ భిక్షాటన చేస్తున్న పిల్లలుగాని తల్లిదండ్రులు లేని పిల్లలు గాని మొదలైన వారిని ఎక్కడైనా గమనించినట్లయితే 1098 కు సమాచారం అందించాలని కోరారు. ముఖ్యంగా 18 సంవత్సరాలు నిండకముందు ఆడపిల్లలకు శరీర అవయవాలలో ఎదుగుదల ఉండదు కాబట్టి బాల్యవివాహాలను నిషేధించడం జరిగిందన్నరు. అలాగే బాలలు ప్రతిరోజు స్కూల్ కి వచ్చి శ్రద్ధగా చదువుకునేలా తల్లిదండ్రులకు సూచించారు. చదువు పట్ల శ్రద్ధ వహించినప్పుడు బాలలు బాల కార్మికులుగా మారే ప్రమాదం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి రాధగోపాల్, ఫీల్డ్ అసిస్టెంట్, టెక్నికల్ ఆఫీసర్, చైల్డ్ హెల్ప్ లైన్ కేసు వర్కర్ నవీన్, సోషల్ వర్కర్ పద్మ, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే జిఎంఆర్

## రైతు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తోంది: ఎమ్మెల్యే జిఎంఆర్

దేవరకద్ర, ఏప్రిల్ 16 (ప్రభాత ఉదయం) చిన్న చింతకుంట మండల కేంద్రంలో కురుమూర్తి, అల్లిపూర్ గ్రామాలలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే జియంఆర్ మాట్లాడుతూ.. రైతుల తమ ధాన్యాన్ని దళారులకు అమ్ముకోకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలోనే ధాన్యాన్ని అమ్మాలని రైతులకు సూచించారు.అనంతరం చిన్న చింతకుంట మండల కేంద్రాలలో పలు వివాహ వేడుకలకు ఎమ్మెల్యే జియంఆర్ హాజరయ్యారు.



## నకిలీ పత్తి విత్తనాలు పట్టివేత

గద్వాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 16(ప్రభాత ఉదయం)నకిలీ పత్తి విత్తనాలు ప్రతీ సంవత్సరం రైతులను నట్టేటా ముంచుతున్నాయి. గద్వాల జిల్లా మల్దకల్ మండలంలోని కుర్తిరావుల చెరువుకు చెందిన కుర్వ శీను అలియాస్ రాజు సబ్ అర్గనైజర్ గ్రామ శివారులో గల తన స్వంత పొలంలో నకిలీ పత్తి విత్తనాలు నిల్వ ఉంచినట్లు అధికారులకు సమాచారం అందడంతో వ్యవసాయ అధికారులు, మండల ఎస్సై నందీకర్ తో కలిసి తనిఖీ చేశారు. 12.75 క్వింటాళ్ల నకిలీ పత్తి విత్తనాలు లభ్యం కాగా వాటిని స్వాధీనం చేసుకున్నారు. మల్దకల్ మండల వ్యవసాయ అధికారి రాజశేఖర్ పంచనామ నిర్వహించి, పోలీసులకు ఫిర్యాదు చేయడంతో నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నందీకర్ తెలిపారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. "RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608